# విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి : ఎస్పీ



శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులతో ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 12: తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. విద్యార్థుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఎస్పీ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, బాలభవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత

కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా పోలీసు చేయూత పథకం ద్వారా ఆయన కుటుంబానికి ఎస్పీ చేతులమీదుగా రూ.2 లక్షల చెక్కును పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ నరసింహ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిశీలించారు.

# ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మే 12: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాటాడుతూ జిల్లా వెబ్ పోర్టల్‌లో శాఖల వారీగా డిపార్ట్‌మెంట్ ప్రొఫైల్, జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు సిబ్బంది వివరాలు, జాబ్ చార్ట్స్, వార్షిక నివేదికలు, పథకాల లబ్ధిదారుల వివరాలు అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు సంక్షేమ అధికారులు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను పరిశీలించి బ్యాంక్ క్లియరెన్స్ ఇప్పించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ నరసింహారావు, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'



మున్సిపల్ కమిషనర్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కోదాడ టౌన్, మే 12: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కోశాధికారి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కోటగిరి వెంకటనారాయణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ముత్యాలు ఆధ్వర్యంలో కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు కొమ్ము నాగేశ్వరరావు, నాగమణి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, గోపి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అభిరాం

కోదాడ రూరల్, మే 12: కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్, విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు సీపీఆర్(కార్డియోపల్మనరీ రెసెసిటేషన్)పై కోదాడకు చెందిన ప్రముఖ వైద్యుడు అభిరాం సోమవారం అవగాహన కల్పించారు. హఠాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు బాధితుల ప్రాణాలను కాపాడేందుకు చేసే అత్యవసర ప్రక్రియే సీపీఆర్ అని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్, సైన్స్ కోఆర్డినేటర్ జాఫర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపునకు విశేష స్పందన : ఎంఈఓ

గరిడేపల్లి, మే 12: విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు విశేష స్పందన లభిస్తుందని మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ తెలిపారు. గరిడేపల్లి, కీతవారిగూడెం, పొనుగోడు గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, కంప్యూటర్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం ఎం.సువర్ణ, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాములు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భావోద్వేగాలతో రాజకీయాలు చేయొద్దు

**● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హుజూర్‌నగర్, మే 12: ప్రజల భావోద్వేగాలతో ఏ పార్టీ కూడా రాజకీయం చేయొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హుజూర్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, సీపీఐ సీనియర్ నాయకురాలు పశ్య కన్నమ్మ సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు. నిజాన్ని నిక్కచ్చిగా, ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉందని పేర్కొన్నారు. అసలైన కమ్యూనిస్టులు తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చెబుతారని అన్నారు. ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టడంలో కమ్యూనిస్టులు వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని, డబ్బు పెడితే కమ్యూనిస్టులే గెలుస్తారని అన్నారు. మనిషికి ఆకలి ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఉంటారని, ఉద్యమాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టులు చెక్కు చెదరకుండా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ, అక్కినేని వనజ, బి.హేమంతరావు, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, నాయకులు గన్నా చంద్రశేఖర్, గుండు వెంకటేశ్వర్లు, దొడ్డ నారాయణరావు, యల్లావుల రాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీఓ

నూతనకల్, మే 12: వేసవిలో నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండల పరిధి మాచనపల్లి, లింగంపల్లి గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఆమె సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి నర్సరీకు గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు ఉమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

తుంగతుర్తి, మే 12: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన బాలికలకు ఈ నెల 16న ఉదయం 11 గంటలకు మిర్యాలగూడ(అవంతిపురం)లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు కళాశాలలో దరఖాస్తు చేసుకొని కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, మే 12: సూర్యాపేట వన్ టౌన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ 1 ఏఈ ఆర్.సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వాణిజ్యభవన్, మధు ట్రావెల్స్, రామలింగేశ్వర టాకీస్, విద్యానగర్, బేబీ కేర్ ఆసుపత్రి, రామ్మూర్తి ఆసుపత్రి, గణేశ్ చౌరస్తా, ఎంఎస్ఆర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**నేరేడుచర్ల మండలంలో..**

నేరేడుచర్ల: మండలంలోని దిర్శించర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ కింద మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ పందిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.


# 'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

గరిడేపల్లి, మే 12: దేశవ్యాప్తంగా మే 20వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల విక్రయాలను నిలిపివేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టనున్న సమ్మెలో కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు నాగన్న, పోటు లక్ష్మయ్య, కామళ్ల నవీన్, ఉదయగిరి, వి.నరసింహారావు, డి.రవి, కామళ్ల శ్రీను, నాగయ్య, మేకల కనకారావు, అంజయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డివాము దగ్ధం

చిలుకూరు, మే 12: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండల కేంద్రం చిలుకూరులో సోమవారం చోటుచేసుకుంది. చిలుకూరుకు చెందిన మంకెన వెంకయ్య అనే రైతు 400 కట్టలతో గడ్డివాము ఏర్పాటు చేసుకున్నారు. కాగా, సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా గమనించిన రైతు తక్షణమే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే గడ్డి దాదాపుగా దగ్ధమైందని, రూ.50 వేల నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

# 'కార్మిక చట్టాల జోలికి రావొద్దు'



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, మే 12: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సూర్యాపేటలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల జోలికి వస్తే ఐక్య పోరాటాలతో కార్పొరేట్ విధానాలను పాతాళానికి తొక్కి పెడుతామని అన్నారు కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి, హమాలీ యూనియన్ నాయకుడు మడిపడగ పురుషోత్తం, పాలబిందెల వెంకన్న, జాలె గురుమల్లు, ఖమ్మంపాటి రమేశ్ పాల్గొన్నారు.

# హోటళ్లు, బేకరీల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు



నేరేడుచర్లలో ఓ బేకరికి జరిమానా విధిస్తున్న అధికారులు

నేరేడుచర్ల , మే 12: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, బేకరీల్లో మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని హోటళ్లు, బేకరీలకు మున్సిపల్ మేనేజర్ యాకుబ్ పాష జరిమానా విధించారు.

**హుజూర్‌నగర్‌లో..**

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని వసుంధర, అప్పారావు, రాజేశ్వరి, న్యూ అప్పారావు హోటళ్లలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న హోటళ్లకు జరిమానా విధించారు.

# 'అంగన్‌వాడీ భవనాల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలి'

చిలుకూరు, మే 12: అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. చిలుకూరులో చేపడుతున్న కొత్త అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీపుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'అందాల పోటీలను నిలిపివేయాలి'

ఆత్మకూర్.ఎస్, మే 12: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అందాల పోటీలను నిర్వహించడం సిగ్గుచేటని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం అందాల పోటీలకు మాత్రం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని, ఇదేంటని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తుందని విమర్శించారు. నెలల తరబడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్నా కనికరం లేదని అన్నారు. తక్షణమే అందాల పోటీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సక్క, పోరండ్ల దశరథ, వీరన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


# 'నిస్వార్థ ప్రజా నాయకుడు ఓంకార్'



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, మే 12: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ నిస్వార్థ ప్రజా నాయకుడు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏపూరు గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి అవిరె అప్పయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఓంకార్ శత జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఓంకార్ పోరాట స్ఫూర్తిని, ప్రజల కోసం చేసిన ఉద్యమాలను కొనియాడారు. కార్యక్రమంలో అశోక్ ఓంకార్, సుధాకర్, ప్రభావతి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, దండ వెంకటరెడ్డి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, సానబోయిన ఉపేందర్, నూకల గిరి ప్రసాద్‌రెడ్డి, వరికుప్పల మహేశ్, ఎరుకల నాగరాజు పాల్గొన్నారు.

# 'మత్తు పదార్థాల నియంత్రణలో భాగస్వాములు కావాలి'



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి బృందం

నాగారం, మే 12: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేశ్, కళాజాత సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, వేణు, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, ప్రజలు పాల్గొన్నారు.

# 'కార్పొరేట్ శక్తులకు మద్దతుగా కేంద్రం'



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిరావు

తుంగతుర్తి, మే 12: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున రాయితీలను కల్పిస్తూ పేద, మధ్య తరగతి వర్గాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలపై అనేక రకాల భారాలు మోపుతూ వారి బతుకులను బజారున పడే విధంగా నిర్ణయాలను తీసుకుంటుందని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక పెట్రోల్, డీజిల్ ధరలను అనేకసార్లు పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని, నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. దేశంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోగా ఎన్నో సంవత్సరాలు కొట్లాడి సాధించుకున్న కార్మికుల 29 చట్టాలను తొలగించి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల పొట్టకొట్టారని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ నిర్ణయాన్ని అమలు చేయకుండా రైతాంగానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చే చట్టాలను తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మేలు కోసం కాకుండా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతుందని దుయ్యబట్టారు.సమావేశంలో కందాల శంకర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, మండల కార్యదర్శి వద్దే శ్రీనివాస్, పోలోజు సైదులు, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి, పళ్ల సుదర్శన్, బత్తుల జనార్దన్, వీరయ్య పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సామేల్ విరాళం

తిరుమలగిరి, మే 12: మండల పరిధిలోని గుండెపురి గ్రామంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం పలుకుతూ ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే సామేల్ రూ.25 వేల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో జుమ్మిలాల్, రామరాజు, శరత్‌బాబు, బాలకృష్ణ, శ్రీనివాస్, కొమ్ము సోమన్న, పాలేపల్లి సోమయ్య, బొడ్డు నరేశ్, గూడూరు నాగయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మలుపులు



జోగికుంట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

మేళ్లచెర్వు, మే 12: మేళ్లచెర్వు-మల్లారెడ్డిగూడెం గ్రామాల మధ్యలో జోగికుంట సమీపంలో మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మలుపుల వద్ద గతంలో జరిగిన ప్రమాదాల్లో ఎంతో మంది గాయాల పాలు కావడమే కాకుండా పలువురు ప్రాణాలు కోల్పోయారు. గతంలో సింగిల్ రోడ్డుగా ఉండగా ఇటీవల డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో వాహనదారులు వేగంగా వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడ్ బ్రేకర్లు గానీ లేకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# 'హామీల అమలులో విఫలం'

నూతనకల్, మే 12: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, ఉద్యమకారులకు ఇంటి స్థలం తదితర హామీలను అటకెక్కించిందని విమర్శించారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**● రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కోదాడ రూరల్, మే 12: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అలసగాని బ్రహ్మయ్య, ఎస్‌కే.సైదా, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకట్‌రెడ్డి, మిట్టగణుపుల ముత్యాలు, వేమ నారాయణ, జొన్నలగడ్డ వెంకటయ్య, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

# ముగిసిన రెవెన్యూ సదస్సులు

గరిడేపల్లి, మే 12: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు సోమవారంతో ముగిశాయి. మండల పరిధి కల్మల్‌చెర్వు గ్రామంలో చివరి రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. కల్మల్‌చెర్వులో 256 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో మే 5 నుంచి 12వ తేదీ వరకు మొత్తం 1,690 దరఖాస్తులు రైతుల నుంచి వివిధ సమస్యలపై స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ బండ కవిత, ఆర్ఐ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


# 'రైతులకు ధాన్యం బిల్లులు చెల్లించాలి'

తిరుమలగిరి, మే 12: రైతులకు ధాన్యం బిల్లులు తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు కడెం లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం తిరుమలగిరిలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్ముకున్న రైతులు బిల్లుల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు జరిగిన వారం రోజుల్లోనే రైతులకు బిల్లులు చెల్లించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్, యాదగిరి, రమేశ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేసవి దుక్కులు.. రైతులకు లాభాలు

**● చీడ పురుగులు, కలుపు నివారణ**

**● పంట దిగుబడికి దోహదం**



వేసవి దుక్కులు చేస్తున్న రైతు

నేరేడుచర్ల, మే 12: వ్యవసాయం అనేది నిత్యకృత్యం. రైతులకు పనిలేని రోజు అంటూ ఉండదు. చేయాలనుకుంటే ఏ కాలంలోనైనా పనులకు కొదవు లేదు. అన్ని కాలాల్లో రైతులు పొలాల్లో బిజీగా గడుపుతుంటారు. వేసవిలో ఎండలకు భయపడి కొంత విరామం ఇస్తుంటారు. కానీ ఈ కాలంలోనూ రైతులు చేసుకోవడానికి పొలం పనులు చాలానే ఉంటాయి. వచ్చే వర్షాకాలం నాటికి పంటలు వేయడానికి ఇప్పటి నుంచే దుక్కులు సిద్ధం చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమైపోవచ్చు. ఎండాకాలంలో పొలంలో చేసే పనులను బట్టే పంట దిగుబడి ఉంటుందని చెబుతుంటారు. వేసవిలో దుక్కులను లోతుగా దున్నుకోవడం వలన రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. వేసవి దుక్కులు చేయకుంటే తలెత్తే నష్టాలు, చేస్తే కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

### వేసవి దుక్కులు దున్నకుంటే..

వేసవి దుక్కులు దున్నకుంటే కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తూ భూసారం తగ్గడానికి కారణమవుతాయి. భూమిలోని లోతైన పొరల నుంచి కూడా తేమను తీసుకుంటూ, ఆవిరి రూపంలో బయటకు పంపుతాయి. దీని వల్ల ముడి పోషకాల కొరత ఏర్పడి తర్వాత వేసే పంటలకు అత్యధిక మోతాదుల్లో రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉంటుంది. పంట కోసిన తర్వాత దుక్కి దున్నకుండా వదిలేయడం వల్ల మళ్లీ వర్షాకాలం వచ్చిన తర్వాత భూమిని దుక్కి చేసి, సిద్ధం చేసేందుకు అలస్యమవుతుంది. దీంతో పంటను సరైన సమయాల్లో విత్తుకోలేరు.

### ప్రయోజనాలు..

**చీడపీడల నివారణ :** వేసవి కాలంలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు మొదలైనవి భూమిలో ఆశ్రయం పొందుతాయి. వేరుశనగ, చెరుకు, పండ్ల చెట్లను ఆశించే వేరు పురుగులు, అపరాలు, పత్తి, కంది మొదలైన పంటలను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగు, బొంత పురుగు, దాసరి పురుగులు కోశస్థ దశలో భూమిలోనే ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసినప్పుడు రెక్క పురుగులు ప్యూపాల నుంచి బయటకు వచ్చి తిరిగి పంటలను ఆశించి నష్టపరుస్తాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల నేలలో ఉన్న చీడపురుగుల కోశస్థదశలు, గుడ్లు బయటపడి ఎండ వేడికి చనిపోతాయి.

**కలుపు నివారణ :** వేసవి దుక్కులు చేయడం వల్ల బహు వార్షిక కలుపు మొక్కలైన తుంగ, గరిక, రెల్లదర్బ వంటివి నాశనమవుతాయి. కలుపు మొక్కలు ప్రత్యక్షంగా నష్టం కలిగించడంతో పాటు పరోక్షంగా చీడపీడలకు ఆశ్రయం ఇచ్చి పంట నష్టానికి కారణమవుతాయి.

**నేలలో నీటి నిల్వ :** వేసవి దుక్కులను వాలుకు అడ్డంగా చేసుకోవాలి. వాలు వెంట దున్నితే నేల కోతకు గురవుతుంది. సాళ్ల వెంట నీరు పరుగెత్తి సారవంతమైన మట్టి వాలుకు కొట్టుకుపోతుంది. వేసవి దుక్కులు చేసే ముందు పొలంలో పశువుల ఎరువు గానీ, కంపోస్ట్ గానీ, చెరువు మట్టి గానీ వెదజల్లడం వల్ల నేలకు తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుంది.

**నేల గుల్లబారడం :** వేసవిలో లోతుగా దుక్కి చేసినప్పుడు, ఆ తర్వాత తొలకరి వర్షాలకు కల్టివేటర్‌తో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పంట మొక్కల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. మేలు చేసే సూక్ష్మాతి సూక్ష్మజీవులు గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు వానపాముల సంతతి కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**పంట అవశేషాల సద్వినియోగం :** లోతు దుక్కి దున్నినప్పుడు పంట కోతల తర్వాత మిగిలిన పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటివి నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారుతాయి. దీంతో నేలలో సేంద్రియ శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది.

### రైతుకు మేలు చేకూరుతుంది



వేసవి దుక్కులు చేయడం ద్వారా రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. చీడపురుగులు, కలుపు నివారణతో పాటు భూమిలో పోషకాలు పెరుగుతాయి. సూక్ష్మజీవులు గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు వానపాముల సంతతి కూడా పెరిగి రైతు పంట దిగుబడికి ఉపయోగపడుతుంది.

**- అరిగేల కిరణ్, గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త**